# దేవుడితో ఇంటర్వ్యూ

రంగధామరావు వెంకటపాలెం పంచాయతీ బోర్డు ప్రెసిడెంటు. చుట్టు పక్కల పదిగ్రామాల్లో మంచి వ్యవహార్త అన్న పేరున్న పెద్దమనిషి. రంగధామరావు ప్రెసిడెంటు పదవికి పోటీ చేయబోయేముందు, తాను నెగ్గిన తక్షణం తిరుపతివచ్చి శ్రీనివాసుని దర్శనం చేసుకుంటానని మొక్కుకున్నాడు. తిరిగి ఎన్నికలు దగ్గరపడుతున్నాయి. అయినా ఇంత వరకు మొక్కు చెల్లించుకోలేకపోయాడు. ఏదో సుస్తీ అయిపోయింది. ఇంకా మొక్కు చెల్లించుకోకపోతే, ఈసారి మళ్ళీ పోటీచేస్తే నెగ్గుతాడో నెగ్గడో అని మనసు పీకుతోంది రంగధామరావుకి.

"ఏమైనాసరే, యీసారి తిరుపతి ప్రయాణం ఖాయం" అనుకున్నాడు. రంగధామరావు,

"రాచపీనుగుతోడులేందే చావదు" అన్నట్లు రంగధామరావు వంటరిగా ఎక్కడికీ ప్రయాణం చెయ్యడు. ఎవరో ఒకరిని తోడు వెతుక్కోవాలి.

"ఎవరిని తీసుకెడితే బాగుంటుంది? ఎవరిని తీసుకెళ్ళినా అట్టూ ముక్కాకూడ కలసొచ్చేలా వుండాలి. సరేలే! రేపు పొద్దున్న పంచాయితీ ఆఫీసుకెళ్ళి తేల్చిపారేస్తాను" అనుకొని, ఆ రాత్రికి నిద్రపోయాడు రంగధామరావు.

తెల్లవారింది. రంగధామరావు రోజూకంటె కాస్త పెందరాళే ఆఫీసుకెళ్ళి, కాంట్రాక్టర్ వెంకటరెడ్డికి కబురుచేశాడు. వెంకటరెడ్డి వచ్చాక, కాస్సేపు చెరువు మరమ్మత్తుకై పిలచిన టెండర్ల విషయం మాట్లాడి, అసలు విషయంలోకి దిగాడు రంగధామరావు.

"ఆఁ చూడు వెంకటరెడ్డి! యీ అయిదేళ్ళబట్టి...నీకు వీలైంది నువ్వు...నొల్లుకుంటూనే వున్నావ్" అన్నాడు ఎంతో సాఫీగా.

"మీకు మాత్రం నేనేం తక్కువ చేశాను?" అన్నాడు రెడ్డి కంగారుగా.

"అబ్బా! అదికాదయ్యా! ఆ మాట మాత్రం అన్నానుటయ్యా? అసలు విషయం వినకుండా కంగారుపడకు. నే చెప్పేదేమిటంటే... నువ్వు రాళ్ళకి బదులు దుమ్ముపరచినా, ఇటుకలకు బదులు మట్టిగడ్డలేసినా సిమెంటుకు బదులు చౌడు మట్టి పోసి పని కానిచ్చినా_అలా నిన్ను-నేను చెయ్యనిచ్చినా-ఇదంతా జాగ్రత్తగా చూసేవాడు పైన ఒకడున్నాడు కాబట్టి"-

"మన ఇంజనీరుగారేనా? ఆయనకి మాత్రం మనం యేం లోటు చేశామని?" అన్నాడు రెడ్డి చాలా ధీమాగా.

"వెంకటరెడ్డీ! నీకు ఆవేశమేగాని ఆలోచన తక్కువయ్యా! మనం దరికంటె పైవాడూ...ఏడుకొండలవాడు. అర్థమయిందా యిప్పుడైనా?" అన్నాడు రంగధామరావు.

"చంపారు గదండిబాబు. ఆ మాట నేను మాత్రం కాదన్నానా? అందుకే నా చేతి కొచ్చిన లాభంలో, ప్రతి రూపాయికి ఓ పైసాచొప్పున ఓ డబ్బీలోవేసి దాచాను" అన్నాడు రెడ్డి తనదేమీ లోపం లేదన్నట్టు. ఇంతలో నల్లబజార్లో అమ్మిన అమోనియా పిండి అకౌంటు తేల్చుకుందు కని రంగయ్య వచ్చాడు. నుదుటినిండా నామం పెట్టుకున్నాడు. ఎవరికైనా సరే నామం పెట్టగల నన్నట్టు.

"అదిగో మన రంగయ్య కూడా వచ్చాడు సమయానికి" అన్నాడు వెంకటరెడ్డి.

"యేంటి బాబూ-ఏదేనా చందాలగోల కాదుగందా" అని ఓంద్ర బెట్టాడు రంగయ్య.

"అలా భయపడి చస్తావేం రంగయ్యా! బస్తా ఒక్కింటికి ఐదు రూపాయల కమీషనూ పుచ్చుకుంటూ కూడ"అన్నాడు ప్రెసిడెంటు రంగ ధామరావు.

"మీకు ముట్టే దాంట్లో రూపాయకి పావలేగా నాకు ముట్టేది-రిక్షా వాడికి తాయారిచ్చే ప్రోకరేజి లాగ" అన్నాడు రంగయ్య బంగారపు పళ్ళు మెరిసేలా నవ్వుతూ.

వెంకటరెడ్డి ప్రెసిడెంటు కళ్ళలోకి చూసి, "రంగయ్య అంటే సామాన్యుడా" అన్నట్టు నవ్వారు.

ఇంకా యీ సంభాషణ పొడిగించడం ఇష్టంలేక, "దాని మాట కేంలేగాని... మేమిద్దరం తిరుపతి వెడదామనుకుంటున్నాం. నువ్వొస్తావా రావా? తేల్చి చెప్పు!" అన్నాడు ప్రెసిడెంటు చిరాగ్గా.

"ఇప్పటి కిప్పుడు సెప్పి యిప్పుడే తేల్చి సెప్పెయ్యమంటే ఎట్టా గయ్యా? వత్తానంటే వంద బొక్క, రానంటే, యేం కొంప మునుగుద్దో అని భయం—యింతకీ ఎప్పుడు పయానం?" అన్నాడు రంగయ్య.

"ఎప్పుడు వెడదామంటావ్ రెడ్డీ?" అని వెంకటరెడ్డిని అడిగాడు ప్రెసిడెంటు.

"మీ యిష్టం. నా మట్టుకు నేను రెడీ" అన్నాడు వెంకటరెడ్డి.

"అంత బొత్తిగా తొందర్లో యెట్టెయ్యకండి పయానం" అన్నాడు రంగయ్య.

"యేం? యింటి దగ్గర పిల్లలకి పాలివ్వాలా రోజూ?" అన్నాడు వెంకటరెడ్డి ఛలోక్తిగా.

"అదికాదయ్యా రెడ్డిగారు. పాలివ్వక్కర లేకపోయినా ఒచ్చేపాలు పిండుకుపోటం మంచిదిగా" అన్నాడు రంగయ్య నిక్క మొహం పెట్టి.

"ఏమిటీ...నువ్వు పాలుకూడా పితుకుతున్నావా యేమిటి యీ మధ్య" అన్నాడు ప్రెసిడెంటు నవ్వుతూ.

"అదికాదండీ! మన రౌడీ రంగడికి ధర్మడబ్బీ బద్దలు కొట్టి డబ్బు వడ్డీకిచ్చా. తిరపతెళ్ళేటప్పుడు యివ్వాలని, ఒట్టేయించుకున్నా. యీ అదునుదాటితే ఆడిక సచ్చినా యివ్వడు. అది వసూలు సేసుకుపోతే మంచిది గందా అని" అన్నాడు రంగయ్య.

"అది వసూలయితే మాత్రం నీకేం లాభం? ధర్మ డబ్బీలో డబ్బు దేవుడికిచ్చేదేగా?" అన్నాడు వెంకటరెడ్డి.

"మంచోడివేనయ్యా రెడ్డీ! డబ్బీలో డబ్బు దేవుడికిచ్చేదిగానీ, దాని మీదొచ్చే వడ్డీ-సామి కెందుకయ్యా. నువ్వు లేనిపోయిన యన్నీ యెట్టకు నాకు" అన్నాడు రంగయ్య. వెంకటరెడ్డి యింకా ఏం నోరు జారతాడో నన్న భయంతో.

"అదేం లాభంలేదు. ఏడుకొండల వాడికి మరో పేరు వడ్డీ కాసుల వాడు! అసలుకంటె వడ్డీయే ఆయన కెక్కువప్రీతి. తెలిసిందా?" అన్నాడు వెంకటరెడ్డి తేడా పాడా వస్తే డొక్క చీల్చేస్తాడు జాగ్రత్త అన్నట్టు.

"అయితే వడ్డీ యిప్పుడు యిచ్చేసి, అసలు వాయిదాలమీద ముట్ట సెప్పుకుంటానని, చేతులు జోడించి ఆయన ముందే సెప్పుకుంటా. మరి సత్తానేటి?" అన్నాడు రంగయ్య ఎంతో బాధగా దేవుడి సొమ్ము వల్ల తన కేం లాభంలేదని.

"యీ సొద కేంలేగాని, ఇంతకీ నువ్వు వస్తావా? రావా?" అన్నాడు ప్రెసిడెంటు నిక్కచ్చిగా.

"నాదేముందయ్యా? తమదే ఆలశం. ఆ రంగడ్ని కబురంపి బాకీ వసూలు చేయించండి మరి" అన్నాడు రంగయ్య అదను తప్పితే యిక

బాకీ వసూలు కాదని "అదెంతపని?" అని పంచాయితీ నౌకర్ని రంగడ్ని పిలుచుకు రమ్మని పంపించాడు ప్రెసిడెంటు.

♦ ♦ ♦

ఇంతలో శ్రీనివాసాచారిగారు గోపాలస్వామి ఆలయంనుంచి తీర్థ ప్రసాదాలను ప్రెసిడెంటుగారి కివ్వటానికి తీసుకు వచ్చారు. ఆచారిగారు పెద్దలకి తీర్థప్రసాదాలు యిచ్చి, ఆలయం మరమ్మత్తు సంగతి ఎత్తారు.

"అది పంచాయితీ అకౌంటులోకి రాదయ్యా! యేదో-నేనూ, మన రెడ్డి, మిగిలిన పెద్దలూ తలో చెయ్యీవేసి అయిందనిపించాలి! తిరుపతి నుంచి తిరిగి వచ్చాక ఆలోచిద్దాంలే" అన్నాడు ప్రెసిడెంటు.

"తిరుపతి కెడుతున్నారా ? ఎప్పుడూ బాబూ ప్రయాణం?"

—ఆ స్వామిని ఎంత చూసినా తనివితీరదు, పది సంవత్సరాల క్రితం తిరుపతివెళ్ళినపుడు, రెండు రోజుల్లో ఆరుసార్లు ధర్మదర్శనం చేసుకున్నాను, ఆ స్వామి పాదాల దగ్గరే వుండిపోవాలనిపించింది: కాని ఆ అదృష్టం మా మావయ్య ఒక్కడికే పట్టింది" అన్నాడు శ్రీనివాసాచారి ఎంతో ఆనందంతోను, తన్మయత్వంతోనూ!

"మీ మావయ్యకి గుళ్లోపనా?" అన్నాడు కాంట్రాక్టరు.

"ఔను బాబు ! చిన్నతనం నుంచీ స్వామివారి అర్చకుడిగా వున్నాడు" అన్నాడు ఆచారి.

"అయితే యింకేం! నువ్వూ బయలుదేరవయ్యా! మాకు దర్శనం బాగా జరుగుతుంది" అన్నాడు ప్రెసిడెంటు.

"నేనిప్పట్లో తూగలేను బాబు! నా దగ్గరంత డబ్బులేదు"అన్నాడు ఆచారి జాలిగా.

"డబ్బుదేముంది లేవయ్యా ? మేం వున్నాంగా" అన్నాడు వెంకటరెడ్డి.

"ఈయనగారి ఖర్చులు ముగ్గురూ పంచుకోవాలంటారేమోనని" లోలోపల భయపడ్డాడు రంగయ్య.

ఇంతలో రంగడు వచ్చాడు. రంగయ్య బాకీ తీర్చటానికి రంగడ్ని వప్పించాడు ప్రెసిడెంటు, కాని రంగడు ఓ చిన్న షరతు పెట్టాడు.

"తననికూడా తిరుపతి తీసుకెళ్ళాలి" అన్నాడు.

"అయితే రంగడి ఖర్చు ఎవరు భరించాలి?" అన్న ప్రశ్న వచ్చింది.

రంగడు. రంగయ్య కివ్వవలసిన బాకీ తీరుస్తున్నాడు కాబట్టి, రంగయ్య రంగడి ఖర్చు భరించాలని ప్రెసిడెంటు, కాంట్రాక్టరు నిర్ణయించారు.

రంగయ్య యీ ఖర్చూ "దేవుడి ఖాతాలోనే రాయొచ్చులే" అని అంగీకరించాడు

♦ ♦ ♦

మొత్తానికి ప్రెసిడెంటు, కంట్రాక్టరు, రంగయ్య, రంగడు, శ్రీనివాసాచారి—అయిదుగురు కలసి తిరుపతి ప్రయాణమయ్యారు. రైలు యెక్కారు. ఎక్కడా కూర్చుందుకు సీటు దొరకలేదు.

ఓ పెదమనిషి పడుకుని నిద్రపోతున్నాడు. "కాస్తలేచి కూర్చో బాబు. మా ప్రెసిడెంటుగారు కూర్చుంటారు" అన్నారు శ్రీనివాసాచారి నిద్రపోతున్న మనిషితో. ఆచారి మాటలోని మెత్తదనాన్ని అలుసుగా తీసుకుని "ప్రెసిడెంటు లేదు, గిసిడెంటు లేదు. పో అవతలకి" అని కసిరి మరోపక్కకి తిరిగి పడుకున్నాడు ఆ నిద్రపోయే మనిషి.

ప్రెసిడెంటు అహం దెబ్బతింది. "ఏమిటా వళ్ళు పొగరు?" అన్నట్టు రంగడి మొహంలోకి చూశాడు. రంగడు తుపాకి గుండులా దూసుకుపోయాడు. నిద్రపోయే మనిషి కప్పుకున్న దుప్పటి లాగేసి "లేసికూకో" అని ఆర్డరు వేశాడు అసలైన ప్రెసిడెంటు తానే అన్నట్లు.

ఆ పెద్ద మనిషి లేచి, మాట్లాడకుండా కూర్చున్నాడు. బయట వాళ్ళకి కనబడకుండా నోట్లో తిట్టుకున్నాడు. ప్రెసిడెంటు చెయ్యి ఒకసారి మీసంమీద కెళ్ళింది. 'మన రంగడిలాంటి వాళ్ళు పదిమంది పెద

కున్నవాడే యీరోజులలో పెద్దమనిషనుకోండి. వెయ్యిమందిలాంటివాళ్ళు వెనకుంటే మంత్రికూడా కావచ్చు" అన్నాడు నెమ్మదిగా కంట్రాక్టరు ప్రెసిడెంటు చెవిలో.

ఆఖరికి ఆచారిగారితో సహా అయిదుగురూ సుఖంగా కూర్చున్నారు. తిరుపతి చేరుకున్నారు. స్టేషనులో దిగారు.

"తిన్నగా కొండమీదకి పోదామా బాబూ!" అన్నాడు శ్రీనివాసాచారి ప్రెసిడెంటుగారితో.

"ఎందుకంత తొందర ఆచారీ? ఉగాంగా చూద్దాం!" అన్నాడు ప్రెసిడెంటు తన మామూలు ధోరణిలో.

రిక్షాల్లో సామానులు వేసుకుని, కాస్త మంచి హోటల్‌దగ్గరికి పోనివ్వమన్నారు.

రిక్షాలు ఒక హోటల్‌దగ్గర ఆగాయి. శ్రీనివాసాచారి సంచి సర్దుకుని దిగబోయాడు.

"ఆగు ఆచారీ!...రెడ్డీ! నువ్వు వెళ్ళి, మనకి కావలసిన సదుపాయాల సంగతి కనుక్కో" అన్నాడు ప్రెసిడెంటు.

వెంకటరెడ్డి ప్రొప్రైటర్‌తో మాట్లాడి వచ్చాడు. "మనకి కావలసిన సదుపాయాలు మనమే తెచ్చుకోవాలట. దీనికంటె ధర్మసత్రం నయం" అన్నాడు వెంకటరెడ్డి.

"అదేమంచిది. ధర్మశాలకే పోదాం పదండి" అన్నాడు శ్రీనివాసాచారి అమాయకంగా.

"నువ్వూరుకోవయ్యా?" అని ఆచారిని చిరాకుపడి, "ఒరేయ్! అన్ని సదుపాయాలు దొరికే లాడ్జిలు ఎక్కడున్నాయి?" అని రిక్షావాళ్ళని అడిగాడు ప్రెసిడెంటు. రిక్షావాళ్ళకి ప్రెసిడెంటు మాటలోని భావం అర్థమయింది. "అంద సంగతి ముందేచెబితే యీపాటికి అక్కడికే పోదుంగా బాబు. పక్క వీధిలో మనకి సూటయ్యే లాడ్జింగులున్నాయి. పోదాం పదండి సామి" అని రిక్షాల్ని మరో వీధికి పట్టించారు వాళ్ళు నవ్వుకుంటూ.

ఆచారికంతా అయోమయంగా వుంది.

ప్రెసిడెంటు సంగతి, కంట్రాక్టరు సంగతి తెలిసిన రంగడికి ఎంతో ఆనందంగా వుంది.

రంగయ్యకు లోలోపల కుతూహలంగా వున్నా, పైకి మాత్రం తడిసిన నవారుగా బిగిసి కూర్చున్నాడు.

రిక్షాలు ఓ లాడ్జి ముందు ఆగాయి. గదులంత బాగోలేవు. రెండు గదులు తీసుకున్నారు. ఓ గదిలో ప్రెసిడెంటు, కంట్రాక్టరు, మరో గదిలో రంగడు, రంగయ్య, శ్రీనివాసాచారి దిగారు. రెండూ పక్క పక్క గదులు.

సాయంకాలమైంది. అలా బజారు తిరిగి వచ్చారు. ఆచారి మనసు ఎప్పుడు స్వామి దగ్గర వాలిపోదామా అని తహతహలాడి పోతోంది. రంగయ్య మనసు రాత్రికి మంచి జల్సా వుందని ఉవ్విళ్ళూరుతోంది. రంగడు పెదాల్ని తడి చేసుకుంటున్నాడు. అంతా స్నానాలుచేసి బట్టలు మార్చుకున్నారు,

శ్రీనివాసాచారి ఒంటరిగా గదిలో కూర్చుని సంధ్యవార్చుకుంటు న్నాడు. ఎదుటి గదిలో ప్రెసిడెంటు, వెంకటరెడ్డి, రంగయ్య, రంగడు వున్నారు.

ప్రెసిడెంటుగారి ఆదేశంమీద వెంకటరెడ్డి చేసిన ఏర్పాట్లప్రకారం సరంజామా అంతా వచ్చింది.

రెండు 'స్కాచ్' బాటిల్స్—మిరపకాయ బజ్జీలు-పకోడి, సోడాలు యిద్దరు చక్కని చుక్కలు-

"ఒరేయ్ రంగడూ! యీ రెండు రూపాయలు పట్టుకొని నువ్వు పోయిరా" అన్నాడు ప్రెసిడెంటు.

"అట్టా అంటే ఎట్టా బాబు. రోజూ నా మొగానికి 'నాటే' ఈయే లేనా 'సీమ' సరుకు రుసి సూడనివ్వండి బాబు" రంగడు గారాబంగా మారాం చేస్తున్నట్లు.

"సరేలే! వుండిపో!" అన్నాడు కంట్రాక్టరు వాడు వెళ్ళనంటే చేసేదేమీ లేదని తెలుసు గాబట్టి.

"ఏమైనా యిదంత మంచి పని కాదేమో" అన్నాడు రంగయ్య తాను పవిత్రుడులా కనిపిద్దామన్న ఆశతో.

"ఏం?" అన్నాడు ప్రెసిడెంటు.

"అబ్బే, పున్యచ్ఛేత్తరంగందా. ఇక్కడ కూడా ఈ పాపాలెందుకూ అని" అన్నాడు రంగయ్య నొక్కినొక్కి.

"రంగయ్యా? పుణ్యక్షేత్రం పైనుంది. చేసేపాపాలు, పైకి వెళ్ళే ముందు ఇక్కడే చేసేస్తే-పైకి వెళ్ళి స్వామి దర్శనం చేసుకున్నపుడు-పాత పాపాలతోపాటు యీ పాపాలూ కొట్టుకుపోతాయి" అన్నాడు వెంకటరెడ్డి.

అందరూ నవ్వుకున్నారు.

ఇప్పుడిప్పుడే అందుకుంటూ వుంది మందు.

తన ప్రక్కన కూర్చొన్న 'పిల్ల'ని రంగయ్య మీదికి గెంటాడు రెడ్డి. పిల్ల కిలకిల నవ్వుతూ, తూలి రంగయ్య మీద పడింది.

"అయ్య బాబోయ్! యిదేంటిది?" అన్నాడు రంగయ్య ఆపిల్లను సందిట్లోకి తీసుకుంటూ.

"అదే పాపచ్ఛేత్రంలో పున్నెం అంటే" అన్నాడు మైకంలో మునిగిపోయిన ప్రెసిడెంటు.

సోడాలు 'చ్' మంటున్నాయి-కార్కులు పేలుతున్నాయి- గాజులు గలగలలాడుతున్నాయి-నవ్వులు-కేరింతలు వగైరా.

ఇంతలో ఆచారి సంధ్యావందనం జపం ముగించుకుని, "యింక భోజనాలకి వెడదామా" అంటూ గదిలో కడుగు పెట్టాడు. అక్కడి దృశ్యాలు చూసి 'శ్రీనివాస, శ్రీనివాస' అంటూ కళ్ళుమూసుకుని తిరిగి తన గదిలోకి ఒక్క అడుగులో పారిపోయాడు.

శ్రీనివాసాచారి గుండెలు దడదడ కొట్టుకుంటున్నాయి. ఈ జులాయి మేళంతో ఎరక్కపోయి వచ్చానని లోలోపల తన్నుతాను తిట్టుకున్నాడు. ఏడుకొండలవాడు వీళ్ళతో తాను వచ్చినందుకు క్షమించడని ఏడవటానికి సిద్ధమయ్యాడు. 'శ్రీనివాసా! శ్రీనివాసా' అని జపిస్తూ మంచంమీద వాలిపోయాడు శ్రీనివాసాచారి. మాగన్నుగా కునుకుపట్టింది కళ్ళు చెమ్మగిలి కొలకుల్లోంచి నీళ్ళుకారాయి.

"ఓరేయ్!...శ్రీనివాసాచారీ! ఎందుకురా అలా ఏడుస్తున్నావ్?"

"ఎవరూ?...స్వామి! ఏడుకొండలవాడ! శ్రీనివాసా! వెంకటరమణ! దివ్యమంగళాకారా!...పొద్దున్నే నేనే నీ దర్శనానికి వద్దామనుకుంటున్నాను. ఈలోగా నువ్వే వచ్చేశావా స్వామి. ధన్యుణ్ణి స్వామి!" అన్నాడు ఆచారి తన్మయత్వంలో.

"నన్ను జపిస్తూ, నువ్వు ఏడుస్తోంటే జాలేసి వచ్చాశారా. ఎందుకురా ఏడుస్తున్నావ్?"

"ఏం చెప్పను స్వామి? ఏడవక ఏం చెయ్యమంటారు?"

"ఇప్పు డేమైందిరా?"

"ఇంకా ఏం కావాలి స్వామి? యిలాటి తాగుబోతులు - రౌడీలు-దొంగలు-హంతకులు-చారులు-హుం-వీళ్ళా స్వామీ నీ భక్తులు? ఇలాంటి వాళ్ళని నీ దర్శనాని కెందుకు రానిస్తావు స్వామీ?"

స్వామి చిరునవ్వు నవ్వాడు.

"వాళ్ళుమాత్రం నా సృష్టికారట్రా! వాళ్ళకి తగిన శిక్ష విధించడానికేరా వాళ్ళని నా దర్శనానికి రానిచ్చేది."

"చూడు స్వామి, ఆ పక్కగదిలోలో వాళ్ళ స్థితి అదేనా నువ్వు శిక్షించేది."

"పిచ్చివాడా! నా దగ్గరకొచ్చే వాళ్ళలో ఎక్కువమంది అలాంటి వాళ్ళే. నీలాంటి వాళ్ళని నేను రమ్మనను. రాకపోయినా బాధపడను. నీవేం పాపం చేశావనిరా, నన్ను దర్శించడం."

'నీ మంచితనం మూలంగా అసలు నువ్వు వున్నావా? లేవా? అనిపిస్తూవుంది కొందరికి. ఉన్నావని కొందరు, లేవని కొందరు కొట్టుకు చస్తున్నారు మాలోకంలో.

"నే నున్నాననీ, లేననీ మీరెందుకురా కొట్టుకు చావడం? నేనున్నానని ఎవరితోనయినా చెప్పానా? లేనని ఎవరితోనయినా చెప్పానా? మానవులకు ఉద్యమాలంటే సరదా అందుకే నా మీదకూడ ఒక ఉద్యమం లేవదీసి ఆనందిస్తున్నారు."

"నీ ధైర్యం చూసుకుని, ఈ రకం దుండగులు ఎంతెంత దురంతాలు చేస్తున్నారో చూడు స్వామి!–హత్యచేసి, శిక్షతప్పితే పదివేలు నీ డబ్బీలో వేస్తానని మొక్కుకొనే వారొకరు—లంచం పుచ్చుకొని రూపాయికి రెండణాలు నీ కిస్తాననే వాడొకడు–దొంగతనంచేసి దొరక్కుండా వుంటే సగం నీ కిస్తానని చూపే వాడొకడు – ప్రభుత్వాన్ని మోసంచేసి టాక్సు ఎగ్గొట్టి నీకు వాటాయిచ్చే వాడొకడు–ఎదుటివాడి కొంప పకడబందీగా తన కొంపమీద వేసుకుని నీకేదో ఆశ చూపే వాడొకడు–పేకాటలో గెలిస్తే ఏదో ముట్ట జెప్పుకొనేవాడు – లాటరీ వస్తే ఏదో కొంత ఇచ్చేవాడు– అంతా ఈ రకం వాళ్ళేగా స్వామి నీ భక్తులు. ఇది నాకెంత మాత్రం నచ్చలేదు స్వామి" అన్నాడు శ్రీనివాసాచారి చేతులుజోడించి.

శ్రీనివాసుడు మందహాసం చేసి 'ఒరేయ్ శీనూ! నువ్వు వట్టి అమాయకుడివిరా. నాదగ్గర కొచ్చే యీ జనం అంతా ఎవర్రా? నువ్వు చెప్పిన వాళ్ళంతా, ప్రభుత్వం చేతిల్లోంచి ఏదోవిధంగా తప్పించుకున్న వాళ్లా–సంఘం దృష్టిలో పడని వాళ్లా కదట్రా! వాళ్ళు నా దగ్గర కొచ్చి నిజం చెబుతార్రా! నా మీద భక్తి లేదు సుమా! భయం! దాని కారణంగా ప్రభుత్వాన్ని మోసం చేసినా, నాకు మాత్రం ముడుపు చెల్లిస్తారురా – వాళ్ళు చేసిన నేరానికి వాళ్ళు పరిహారం చెల్లించేలాచేసి, గుండు గొరిగించి పంపిస్తున్నారురా. అంతకన్న నేను మాత్రం ఏం చేయగలనురా" అన్నాడు.

"ఈ పాపపు సొమ్మును ఏం చేసుకుంటారు స్వామి" అన్నాడు శ్రీనివాసాచారి అమాయకంగా.

"పిచ్చి శీనూ! నాకెందుకురా ఈ డబ్బు? ఆ డబ్బుతో ఏం చేస్తున్నానో చూడు-లేచి నాతోరా-ఆ యూనివర్శిటీ చూశావా? ప్రతియేటా వేలమంది విద్యార్థులకి విద్యాదానం జరుగుతుం దక్కడ. ఈ కళాశాలలు చూశావా! రకరకాల శాస్త్రాలు, మనిషి కుపకరించేవి నేర్పబడతా యక్కడ-నేనొక పెద్ద పారిశ్రామిక వేత్తనిరా, నా పరిశ్రమలలో ఎందరో బ్రతుకుతున్నారు. నా బొమ్మలమ్ముకొని బ్రతికేవాళ్ళు - నా ప్రసాదం అమ్ముకుని బ్రతికేవాళ్ళు. నా దర్శనానికి ఖరీదుకట్టి అమ్మే వాళ్ళు-నాకు మొక్కు చెల్లించిన నీలాలలో రకరకాల సవరాలు, విగులు తయారు చేసుకుని అమ్ముకు బ్రతికేవాళ్ళు ఈ కార్మికులు - కూలీలు-జనం యివన్నీ నా పేరుమీదే కదట్రా. నా కిందులో పీసమెత్తు వాటా కూడా లేదుసుమా. అంతా వాళ్ళే రకరకాలుగా పంచుకు తింటారు, నాకు పెట్టే నైవేద్యంకూడా నేను ముట్టుకోను. అదీ వాళ్ళే తింటారు. యిన్ని మంచి పనులు నా పేరుమీదుగా, ఈరకం జనం యిచ్చిన డబ్బుతో జరుగుతున్నాయి. నేనుకూడా వాళ్ళని నా దర్శనానికి రానివ్వనంటే, ఈ డబ్బంతా వాళ్ళ దగ్గరే వుండిపోతుంది. ఎంతోమంది నిరాశ్రయులౌతారు. ఎన్నో సత్కార్యాలు ఆగిపోతాయి. ఇప్పుడు చెప్పరా. వాళ్ళని నా దర్శనానికి రానివ్వమంటావో? వద్దో?"

"నువ్వు గొప్ప సోషలిస్టువి స్వామి" అన్నాడు శ్రీనివాసాచారి.

'ఒరేయ్, ఒరేయ్. నన్ను కూడా మీ కుళ్ళిపోయిన రాజకీయాల్లోకి లాగి మలినం చెయ్యకురా. ఈవేళ ఒక పార్టీలోవున్న వ్యక్తి, మర్నాడు అదే పార్టీలో సూర్యుడ్ని నిలబెట్టి వెదకినా కనపడడు మీ లోకంలో' అన్నాడు శ్రీనివాసుడు.

'క్షమించు స్వామి! గత ఇరవై రెండేళ్ళనుంచి వాక్స్వాతంత్ర్యం అలవాటైపోయి నోటి కొచ్చినట్లు వాగేస్తున్నాను' అన్నాడు శ్రీనివాసాచారి స్వామిని నొప్పించానన్న బాధతో.

'అసలు విషయం చెప్పవేమిరా? వాళ్ళని నా దర్శనానికి రానివ్వమంటావా? వద్దా?' అన్నాడు శ్రీనివాసుడు. 'రానీయ్ స్వామి—నేను నీ దర్శనానికి వాళ్ళ పాపపు డబ్బుతో వచ్చాను. నీ కిచ్చుకుందుకు నా దగ్గరేమీలేదు. నా కిదివరకటి నుంచీ బోడి గుండే-ఆఖరికి జుట్టుకూడాలేదు. నన్ను క్షమించుస్వామి' అన్నాడు ఆచారి ప్రాధేయపూర్వకంగా.

'నువ్వు నాకేమి యివ్వక్కరలేదురా, పాపపు డబ్బుతో వచ్చానని బాధ పడకు. డబ్బుకి పాప మంటదురా. పాపం మనసుకి మనిషికి సంబంధించినది-వస్తారా' అంటూ ప్రెసిడెంటు, వాళ్ళు ఉన్న గదివైపు వెళ్ళబోయాడు శ్రీనివాసుడు.

'ఆగుస్వామి, ఆగు-అటు వెళ్ళకు స్వామి. ఆ గదిలో వట్టి రౌడీమేళం వుంది - వాళ్ళకి కాస్త ఏదోరకంగా బుద్ధి చెబుదు స్వామి' అన్నాడు ఆచారి,

"ఒరేయ్! నువ్వు మంచి వాడవేనా!'

'ఔను స్వామి.'

'మరినేనో ?'

'మీరు చాలా మంచివారు స్వామి.'

శ్రీనివాసుడు నవ్వుకున్నాడు.

'నువ్వు బుద్ధి చెబితే వాళ్ళు వింటారట్రా ఆచారీ' అన్నాడు శ్రీనివాసుడు.

'తంతారు స్వామి.'

'మరి నేను నీకంటె మంచివాడ్ని కాదట్రా' అన్నాడు శ్రీనివాసుడు నవ్వుకుంటూ.

'అంతమాట అనకండి స్వామి. మీరు సృష్టి స్థితిలయకారకులు. మీ ముందు మానవులెంత స్వామి' అన్నాడు ఆచారి భక్తితో.

'ఏమోరా. అలా అనటానికి వీల్లేదు. మొన్నటిదాకా చంద్రుడ్ని దేవుడని నమ్మి పూజించారు మీరు. ఇప్పుడు మనిషి చంద్రునిమీద కెక్కి-కూర్చున్నాడు-ఆ తరువాత అంగారకుడు- సూర్యుడు- దీని కంతేముంది చెప్పు- చివరికి నా ఉనికినే కాదంటాడు' అన్నాడు శ్రీనివాసుడు గంభీరంగా.

'అదేమిటి స్వామి? ఈ నవగ్రహాలు, పంచ భూతాలు, సర్వ జీవ రాసులూ మీ సృష్టేగదా-మీకు నాశనం లేదు. అవన్నీ తమతమ వయస్సు నిండగానే విచ్ఛతి నొందేవే - నా చేత పలికించాలని గాని, మీరు సర్వ నాటక సూత్రధారులు కారాస్వామి' అన్నాడు శ్రీనివాసాచారి పెద్ద వేదాంతిలా.

'పిచ్చి వాడా!' అని నవ్వుతూ అదృశ్యమైపోయాడు శ్రీనివాసుడు

'స్వామి! శ్రీనివాసా: ఏడుకొండలవాడా' అని బొబ్బ లెడుతూ తలుపులు తెరచుకొని ప్రెసిడెంటు, మిగిలిన వాళ్ళు వున్న గదిలోకి వచ్చాడు ఆచారి.

'ఏమిటయ్యా అలా అరుస్తున్నావ్? ఏడవకొండ మీదున్నాడు ఏడుకొండలవాడు. అప్పుడే ఆరు గంటలయింది. త్వరగా స్నానం జపం కానియ్. బయలుదేరదాం' అన్నాడు వెంకటరెడ్డి మంచం మీంచి లేస్తూ.